క్లుప్తంగా

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ కుమార్‌యాదవ్


కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

పటాన్‌చెరు టౌన్: డ్రైనేజీ సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో పర్యటించారు. శాంతినగర్ కాలనీలో రోడ్డు చిప్పింగ్ చేసి పైప్‌లైన్‌తో పాటు డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు కార్పొరేటర్ కోరారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన


ఆడిపాడుతున్న భక్తులు

జహీరాబాద్ టౌన్: హరేకృష్ణ బృందం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని రాచన్నపేట ప్రాంతంలో 150వ నగర సంకీర్తన భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భక్తులు హరి నామాన్ని జపిస్తూ, కీర్తనలు ఆలపిస్తూ రాచన్నపేట నుంచి భవాని మందిరం వరకు పాదయాత్ర కొనసాగింది. అనంతరం మందిరంలో భజనలు, కీర్తనలు ఆలపించారు. మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భగవంతుడి నామస్మరణ చేయాలన్నారు.

అనారోగ్యంతో మాజీ ఉపసర్పంచ్ మృతి


శ్రీనివాస్‌గౌడ్

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లికి చెందిన మాజీ ఉపసర్పంచ్ చంద్రం శ్రీనివాస్‌గౌడ్(46) అనారోగ్యంతో మృతి చెందాడు. కొన్ని నెలలుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స అనంతరం కోలుకున్నారు. శనివారం అర్ధరాత్రి ఆరోగ్యం విషమించడంతో మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

డిజిటల్ సేవలు అభినందనీయం


ప్రారంభోత్సవంలో పాల్గొన్న గోవర్ధన్ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): గ్రామాల్లో ఆధునిక డిజిటల్ సేవలు అందుబాటులోకి రావడం శుభపరిణామమని సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపాలిటీలోని వర్తక సంఘం భవనంలో అయ్యప్ప కమ్యూనికేషన్ డిజిటల్ సేవా సెంటర్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. నేడు గ్రామగ్రామాన ఆధునిక డిజిటల్ సేవలు అత్యంత వేగవంతంగా విస్తరిస్తున్నాయని అన్నారు. యువత ఐటి రంగంలో ఆసక్తిగా ముందుకెళ్లడం గొప్పవిషయమన్నారు. మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, నాయకులు సదానంద రెడ్డి, మోహన్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ కమిటీ సభ్యులకు సన్మానం


సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

సంగారెడ్డి జోన్: బీసీ సంక్షేమ సంఘం కమిటీ సభ్యులను సన్మానించారు. ఆదివారం పట్టణంలో కమిటీ సభ్యులకు పూలమాల, శాలువాతో సన్మానించి, అభినందించారు. నూతన కమిటీలో ఉమ్మడి మెదక్ జిల్లా సలహాదారుడిగా చంద్రయ్య స్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కిష్టయ్య, రాష్ట్ర సభ్యుడిగా గోకుల్ క్రిష్ణలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రభుగౌడ్, రాజేశ్వర్‌స్వామి, మల్లికార్జున్ పాటిల్, వెంకటరాములు, గంగాధర్, సిద్ధయ్య స్వామి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కల్హేర్(నారాయణఖేడ్): మున్సిపాలిటీలో వాటర్ సప్లై విభాగం సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న బస్వరాజ్ ఆకస్మికంగా మృతి చెందారు. ఆదివారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి బస్వరాజ్ స్వగ్రామం చిన్నాముబారక్‌పూర్‌లో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు యాదవరెడ్డి, మోహన్ రెడ్డి, జయరాజ్ ఉన్నారు.

పూసింది పూత..
నిలబడని కాత


అంతంత మాత్రంగా ఉన్న మామిడి కాత

ఆందోళనలో మామిడి రైతులు
- వెంటాడుతున్న అకాల వర్షాలు
- తెగుళ్లతో రాలిన పిందెలు
- ఫలరాజు ప్రియం

జహీరాబాద్ టౌన్: పలు కారణాల వల్ల మామిడి రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. ఈ ఏడాది పరిస్థితి మరీ దారుణంగా ఉంది. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా కాత అంతంత మాత్రంగా ఉంది. ఆలస్యంగా పూత పూసినా.. తెగుళ్ల ప్రభావం వల్ల పిందెలు రాలి కాత నిలబడటం లేదు. అకాల వర్షాలు వెంటాడుతున్నాయి. దిగుబడి గణనీయంగా తగ్గడంతో ఫలరాజు ప్రియమైంది.

జిల్లాలోని జహీరాబాద్, సంగారెడ్డి, పటాన్‌చెరువు తదితర ప్రాంతాల్లో అధిక శాతం మామిడి తోటలు ఉన్నాయి. జహీరాబాద్ ప్రాంతంలో మామిడి సాగుకు అనుకూలమైన ఎర్రనేలలు ఉండడం, పుష్కలంగా నీటి వనరులు అందుబాటులో ఉన్నందున తోటల విస్తీర్ణం పెరుగుతుంది. వందల ఎకరాలో మామిడి తోటలు ఉండగా బెనిషాన్, పెద్ద రసాలు, చిన్న రసాలు, కెసరి, సఫేదా, మల్లికా, మల్గోబా, మహమూద, తెల్లగులాబి, పాపరావు గోవా, నీలాలు, తొతపరి, గోల తదితర రకాలను సాగు చేస్తున్నారు. జహీరాబాద్ పండిన పంటలో 75 శాతం మహారాష్ట్ర (ముంబాయి), కర్నాటకతో పాటు హైదరాబాద్‌కు ఎగుమతి అవుతుంది.

దెబ్బతీసిన వాతావరణం

మామిడి రైతులకు దెబ్బమీద దెబ్బ పడుతుంది. గత సంవత్సరం కాత విపరీతంగా ఉండగా ధర లేదు. ఈ ఏడాది ధర ఉన్నా దిగుబడి తగ్గింది. వాతావరణం అనుకూలించక పూత కాత తగ్గింది. చెట్లకు అక్కడక్కడ మాత్రమే కాయలు కనుబడుతున్నాయి. పంట దిగుబడి లేక రైతులు, వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఈసారి 20 నుంచి 30 శాతం వరకు దిగుబడి వచ్చే అవకాశాలు ఉండగా ఒక్కసారిగా అకాల వర్షాలు ఆందోళన కల్గిస్తున్నాయి. ఉన్న కాతలో అధికశాతం గాలివానకు నేల రాలుతుంది. పంట దిగుబడి తగ్గిన కారణంగా మామిడి పండ్లు దొరకడం కష్టమని రైతులు అంటున్నారు. జహీరాబాద్ మార్కెట్‌కు అంతంత మాత్రంగానే పండ్లు వస్తున్నాయి. డిమాండ్ పెరిగి ఎక్కువ రేటు పలుకుతుంది.

పెట్టుబడులు కూడా కష్టమే!

ఈ సంవత్సరం వాతావరణంలో మార్పుల వల్ల పూత కాత లేక పంట దెబ్బ తింది. కొద్దిపాటిగా ఉన్న కాత అకాల వర్షాలకు నేలరాలింది. దిగుబడులు భారీగా తగ్గాయి. ఈసారి పంటకు పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవాలి

– శివకుమార్, మామిడి రైతు, జహీరాబాద్

ఘనంగా ఈస్టర్ వేడుకలు


ప్రార్థనలు చేస్తున్న మహిళలు

హత్నూర (సంగారెడ్డి): మండల పరిధిలోని కాసాల, కొన్యాల, రెడ్డి ఖానాపూర్, రెడ్డిపాలెం ,హత్నూర, దౌల్తాబాద్, తదితర గ్రామాల్లో ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాసాల గురువులు రెవరెండ్ కాంతారావు, కొన్యాల గురువులు రెవరెండ్ అమృతయ్య, లు వాక్యోపదేశం చేశారు. ఉదయాన్నే మహిళలందరూ తెల్లటి నూతన దుస్తులు ధరించి కాగడాలు చేత పట్టుకొని ఏసుక్రీస్తుకు జయం కలుగును గాక జయం జయం హల్లెలూయ అంటూ పురవీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆలయాల ముంగిట ఏర్పాటు చేసిన శిలువ వెలుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. పాస్టొరేట్ కమిటీ మెంబర్స్ ప్రభాకర్, భాస్కర్, సాగర్, సామెల్, నీరుడి రమేష్, సంఘ పెద్దలు భాస్కర్, శంకరయ్య, లక్ష్మయ్య యాదగిరి, సుధాకర్, ప్రభాకర్, గంగయ్య, పురుషోత్తం పాల్గొన్నారు.

సొంత నిధులతో బోరు ఏర్పాటు


గిరిధర్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రజలు

జహీరాబాద్ టౌన్: రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.గిరిధర్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ ఉజ్వల్‌రెడ్డిలు సొంత నిధులతో బోరు ఏర్పాటు చేయించారు. పట్టణంలోని బాగారెడ్డిపల్లి ప్రాంతంలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. మిషన్‌భగీరథ నీటి సరఫరా నిలిచిపోతే బిందెడు నీరు దొరకడం కష్టంగా ఉంది. దీంతో కాలనీ ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. బోరు వేయించాలని ప్రజలు కోరగా గిరిధర్‌రెడ్డి, డాక్టర్ ఉజ్వల్‌రెడ్డిలు స్పందించి ఆదివారం కాలనీలో బోరు వేయించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు గిరిధర్‌రెడ్డిని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


రఘునందన్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న అపార్ట్‌మెంట్ వాసులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నిత్యం ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాన్నానని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఆదివారం రామచంద్రాపురంలోని స్నేహ లేక్‌వ్యూ అపార్ట్‌మెంట్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడి వారు ఆయనను ఘనంగా సన్మానించారు. తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. తమకు ఆక్యుపేషన్ సర్టిఫికెట్ ఇవ్వని కారణంగా మంజీరా నీరు రావడం లేదని అపార్ట్‌మెంట్‌వాసులు ఆయనకు వివరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. అపార్ట్‌మెంట్ వాసులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రెండు రోజుల్లో జీహెచ్‌ఎంసీ అధికారుల వద్దకు స్వయంగా వెళ్లి సమస్యను వివరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో భోగయ్య, గుండం మోహన్ రెడ్డి, బాలమనోహర్, రామకృష్ణ, సజీవ్ నాయర్, మధుసూదన్ రెడ్డి, జ్ఞానేశ్వరి, కల్పన, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అఖండహరినామ సప్తాహ

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని భూమయ్య కాలనీలోని శివపంచాయతన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో అఖండ హరినామ సప్తాహ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం నుంచి 28 వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వామన్‌రావు మహరాజ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో బీరప్పస్వామికి బోనాలు


పోతరాజుల విన్యాసాలు

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలోని కొల్లూర్ గ్రామంలో బీరప్పస్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం గ్రామంలోని మహిళలు పురవీధుల గుండా బోనం ఎత్తుకుని డప్పు చప్పుళ్ల, పోతురాజుల విన్యాసాల నడుమ ఆలయానికి చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు వేసి బోనాలు సమర్పించారు. స్వామివారికి అభిషేకం, కుంకుమార్చన, అలంకరణ, మహామంగళహారతి తదితర పూజలు చేశారు. అనంతరం మహానైవేద్యం సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు.

పేపర్ బ్యాగ్‌లతో ఈగ నివారణ


రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

జహీరాబాద్: మామిడి పండ్లను ఈగ సమస్య నుంచి కాపాడేందుకు పేపర్ బ్యాగులతో కప్పడం ప్రయోజనకరంగా ఉంటుందని కొండా లక్ష్మణ్ ఉద్యానకళాశాల విద్యార్థినులు రైతులకు వివరించారు. ఆదివారం మండలంలోని రంజోల్ గ్రామంలో పేపర్ బ్యాగ్‌లతో మామిడి కాయలను కప్పడం వల్ల ఈగ నుంచి మామిడి కాయలను రక్షించుకోవచ్చని తెలిపారు. మామిడి పండు నాణ్యవంతంగా, ఆకర్షణీయంగా వస్తుందని, రుచి బాగా ఉంటుందన్నారు. దీంతో మార్కెట్లో మంచి ధర లభించి, ఆదాయం పొందవచ్చని చెప్పారు. పండుకు ఈగ వల్ల కలిగే నష్టాలను అధిగమించగలుగుతారని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్‌కుమార్, విద్యార్థులు జ్యోతి, స్వప్న, మేఘన, మహాలక్ష్మి, యశస్విని, శిరీష, ప్రియాంక, రైతులు షంశొద్దీన్, బాబర్ పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ సీజ్


ఇసుక టిప్పర్

మునిపల్లి(అందోల్): ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇస్మాయిల్ ఖాన్‌పేట నుంచి బీదర్‌కు ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను అడ్డుకొని బుదేరా ఎస్‌ఐ రాజేశ్ నాయక్ సీజ్ చేశారు. ఆదివారం మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా సదాశివపేట వైపు నుంచి జహీరాబాద్‌కు ఇసుక లోడ్‌తో వెళ్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇసుక, టిప్పర్‌కు సంబంధించిన పేపర్లు లేకపోవడంతో వాహనాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. ఇస్మాయిల్ ఖాన్‌పేటలో తక్కువ ధరకు ఇసుకను కొని బీదర్‌లో ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నట్లు వెల్లడించారు. టిప్పర్ డ్రైవర్ అబ్దుల్ ముబీన్, టీప్పర్ యజమాని మహమ్మద్ సాబేర్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

ప్రచార వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్వామిజీ

సంగారెడ్డి : సంగారెడ్డిలోని 'శ్రీరామాలయం'లో 'హైందవ భక్తి కళా సమ్మేళనం' ప్రచార వాల్‌పోస్టర్‌ను ఆదివారం అన్నమయ్య కళాక్షేత్ర పీఠాధిపతి విజయశంకర స్వామి ఆవిష్కరించారు. మే 7న హైదరాబాద్‌లో జరగనున్న 'హైందవ భక్తి కళా సమ్మేళనం'కు వేలాది భక్తులు తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వివిధ ప్రజా సంఘాల నాయకులు, భక్తులు విజయశంకర స్వామివారికి ఆహ్వానం పలికారు. తిరుపతి తరహాలో 'యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో నిత్య అఖండ హరినామ సంకీర్తన జరగాలని మే 7న ఉ.10 గంటలకు హైదరాబాదులోని ఇందిరా పార్కు వద్ద అన్నమయ్య కళాక్షేత్ర పీఠాధిపతి విజయశంకర స్వామి నేతృత్వంలో జరగబోయే హైందవ భక్తి కళా సమ్మేళనం కు వేలాది భక్తులు తరలి రావాలని పిలుపునిస్తూ శ్రీరాముని సన్నిధిలో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హిందూస్ ఫర్ ప్లూరాలిటీ అండ్ ఈక్వాలిటీ అధికార ప్రతినిధి మల్లికావల్లభ, జైభారత్ రాష్ట్ర కార్యదర్శి ఖదిజ్ఞాసి రాజు, జానపద సంకీర్తన గురువు గుండప్ప, శ్రీరామ భజన మండలి భిక్షపతి, ఇమ్మయ్య, సుమిత్ర, ప్రవీణ్, నాగభూషణం, ప్రభాకర్, దుర్గేష్ పాల్గొన్నారు.

భగవన్నామ స్మరణే మనిషికి మోక్షం

మాజీ మంత్రి హరీశ్‌రావు


మాట్లాడుతున్న హరీశ్‌రావు, ఎమ్మెల్యే ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): భగవన్నామ స్మరణే మనిషికి మోక్షం నిత్యం భగవంతుడిని స్మరించుకుంటూ సాగితే ఎలాంటి బాధలు దరి చేరవని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. వాసవీ కన్యకాపరమేశ్వర మందిరంలో ఆదివారం దిడ్డిగే శంకర్‌గుప్తా కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన సుహాసిని పూజా కార్యక్రమానికి హాజరయ్యారు. వాసవీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి ఇచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరు సుహాసితత్వాన్ని పొంది ఉన్నారో వారిని దేవతగా అనుకోని పూజించే విధానమే సుహాసిని పూజ. సుహాసిని అంటే పసుపు, కుంకుమ, కలిగిన స్త్రీలు సర్వమంగళ స్వరూపిణి అమ్మవారి అనుగ్రహం ఎవరి మీద అయితే ఉంటుందో వారు సుహాసిని తత్వాన్ని కలిగి ఉంటారన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం, షుగర్, బీపీలు రాకుండా ఉండేందుకు మితమైన ఆహారం తీసుకుని ప్రతి రోజు యోగ, వ్యాయామాలు, నడవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అపర్ణపాటిల్, మాజీ వైస్ చైర్మన్ చింతా గోపాల్, వాసవి కన్యకపరమేశ్వర మందిరం గౌరవ అధ్యక్షుడు అంజయ్య, వైశ్య సంఘం అధ్యక్షుడు ప్రకాశం పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట్ మండలం బాచేపల్లిలో ఆదివారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సంగారెడ్డి, సీఈఓ విఠల్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ కాల్వ అంజిరెడ్డి పాల్గొన్నారు.

కల్హేర్‌లో వరి కొనుగోలు కేంద్రం

కల్హేర్ మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఎం.వీర్‌షెట్టి, ఐకేపీ వీసీఓ బాలమణి, కాంగ్రెస్ నాయకులు నాగరాజు, రాజేశ్వర్‌గౌడ్, కేశిగొండ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఘనంగా ఉద్యోగ విరమణ సభ

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం కొడకంచి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు జయలక్ష్మి ఉద్యోగ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభకు మండల ఇన్‌చార్జి ఎంఈఓ కుమార స్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మితమవుతుందన్నారు. జీవితంలో ఉద్యోగ విరమణ తప్పనిసరి తెలిపారు. విద్యాభివృద్ధికి జయలక్ష్మి చేసిన సేవలు కొనియాడారు. ఎంఈఓ ఉపాధ్యాయులతో కలిసి జయలక్ష్మి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్ర మంలో హెచ్ఎంలు మృదుల, ప్రేమావతి, ఉపాధ్యాయులు మొగలిమాల, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ పేకాట రాయుళ్ల అరెస్టు

ఝరాసంగం(జహీరాబాద్): పేకాట ఆడుతున్న 5గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. ఆదివారం మండలంలోని గుంతమర్పల్లి గ్రామంలో 5మంది పేకాట ఆడుతున్నారన్న నమ్మదగిన సమాచారంతో దాడులు నిర్వహించి, వారిని అదుపులోకి తీసుకున్నారు. రూ.20090లు నగదు, పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నరేష్ పేర్కొన్నారు.

◆ ఘనంగా పూర్వాషాఢ నక్షత్ర వేడుకలు

సంగారెడ్డి టౌన్: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని భవాని భువనేశ్వరి ఆలయంలో పూర్వాషాఢ నక్షత్ర వేడుకలు ఆదివారం నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేక కార్యక్రమాలను జరిపించి, మహిళలు సామూహిక కుంకుమార్చన, లలిత సహస్ర పారాయణం చదివారు. అనంతరం అమ్మవారి పల్లకీ సేవా కార్యక్రమం నిర్వహించారు.

◆ ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

సదాశివపేట(సంగారెడ్డి): అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 20వ వరకు నిర్వహించిన అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. వారోత్సవాల ముగింపు సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతి సయ్యద్ రఫీ, ద్వితీయ బహుమతి షేక్ అబ్దుల్‌ముజామిల్, అయేషా, తృతీయ బహుమతి అప్సఅఫ్రీన్‌లకు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. అగ్నిమాపక అధికారి భిక్షపతి మాట్లాడుతూ.. వారం రోజుల పాటు అగ్నిమాపక కేంద్రం పరిధిలోని ఆయా ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

◆ వరంగల్ సభను విజయవంతం చేయండి



పుల్‌కల్(అందోల్): వరంగల్‌లో 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం పుల్‌కల్‌లో బీఆర్ఎస్ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని ఆరోపించారు. వానాకాలంలో సింగూరు ప్రాజెక్టులో నీళ్లున్న మరమ్మతుల పేరుతో సాగునీరు ఇవ్వలేదని మండిపడ్డారు. యాసంగిలో ప్రభుత్వం క్రాఫ్ హాలీడే అని ప్రకటించిన రైతులకు అవగాహన కల్పించలేదన్నారు. దీంతో యాసంగిలో కాలువలకు నీళ్ల వస్తాయనే ఆశతో రైతులు పంటల సాగు విస్తీర్ణం పెంచారని తెలిపారు. కాలువల నీరు రాకపోవడం భూగర్భ జలాలు తగ్గి బోర్లు ఎండిపోవడంతో సగానికి సగం వరి పంట ఎండిపోయిందని వాపోయారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు విజయ్‌కుమార్, నర్సింహారెడ్డి, యాదగిరిరెడ్డి, పడమటి రమేష్, శ్రీనివాస్‌చారి, మహేష్ బాబు, లోకేష్ పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించుకొనేందుకు సిద్ధం కావాలి

న్యాల్‌కల్(జహీరాబాద్): ఇందిరమ్మ ఇళ్లు మంజూరై నిర్మించుకొనేందుకు సిద్ధంగా ఉన్న వారిని గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఆదివారం మండలంలోని రత్నాపూర్, మల్గి గ్రామాల్లో ఎంపీడీఓ రాజశేఖర్ కౌలాస్, పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ముందుగా నిరుపేదలు, వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని ఎంపీడీఓ తెలిపారు. ఇళ్లు నిర్మించుకునే వారు పనులు ప్రారంభించుకునేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ తదితరులు

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

కంది(సంగారెడ్డి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని ఎంపీఓ మహేందర్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని ఇంద్రకరణ్‌లో లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఇందిరమ్మ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం 18 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేసినట్లు చెప్పారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్మికులకు సబ్బులు, నూనెలు బెల్లం తదితర వస్తువుల కిట్లను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎంఎస్ వాణితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.